# ఉద్యోగ పర్వం

ఈ వారం వ్రాస్తున్న కబుర్లకి "లే ఆఫోపాఖ్యానం" అని పేరు పెడదామనుకున్నాను.

"ఏం బాబూ, నిన్నకాక మొన్న తెంగ్లీషు మీద వ్రాసి ఇప్పుడు ఇటు తెంగ్లీషూ కాదు, అటు ఇంగ్లీషూ కాదు, ఇదేం పేరు" అని మిత్రులు నా మీద విరుచుకు పడతారని ఆ పేరుని "ఉద్యోగ పర్వం" అని మార్చాను.

ప్రపంచ ఆర్థిక పరిస్థితి మొదట కొంచెం బద్ధకించి, తర్వాత మందగించి, తర్వాత సొమ్మసిల్లి, ఇప్పుడు నిద్రావస్థలో వుంది. బద్ధకించటం దగ్గర్నించి నిద్రపోవటం దాకా ఇప్పటికి మూడేళ్ళయింది. ఆర్థిక పండితులు శాస్త్రోక్తంగా లెఖ్ఖలు కట్టి, ఇప్పుడు ఇంకా వర్జంవుందనీ ఈనాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఈ రాహుకాలంలోనించీ బయటపడటానికి, కనీసం ఇంకో అర్థ సంవత్సరం పడుతుందనీ అంచనాలు వేస్తున్నారు.

"అయ్యా! ఆర్థిక మాంద్యానికీ ఆర్థిక సంక్షోభానికీ తేడా ఏమిటండీ?" అని అమెరికాలో ఒక ఆర్థిక శాస్త్రజ్ఞుడ్ని ఎవరో అడిగారుట. ఆయన తడుముకోకుండా "మా పక్కింటాయనకి ఉద్యోగం పోతే ఆర్థిక మాంద్యం. (ఎకనమిక్ డౌన్ టర్న్). నాకే ఉద్యోగంపోతే అది ఆర్థిక సంక్షోభం. (ఎకనమిక్ డిప్రెషన్)" అన్నాడుట.

నేను ఇండియాలో వున్నప్పుడు, అరవైలలో పిడబ్ల్యుడిలో ఉద్యోగాలు తీసేసినప్పుడు, దాన్ని రిట్రెంచ్‌మెంట్ అనేవారు. అమెరికాలో మనం మానేయకపోయినా ఉద్యోగాలు పోయేది రెండురకాలుగా. ఒకటి "ఫైర్" అవటం. రెండవది "లే ఆఫ్" అవటం. ఆఫీసులో సరిగ్గా పనిచేయకపోయినా, ప్రాజెక్టులు అనుకున్న టైమ్‌కి మన తప్పు వల్ల పూర్తి చేయలేకపోయినా, ఉద్యోగంలో అసమర్థతవున్నా, చాలసార్లు ఆలస్యంగా వెళ్ళినా, ఆఫీసులో ఏదన్నా చేయకూడనివి చేసి నేరాల్లో ఇరుక్కున్నా జరిగే దాని పేరు ఫైరింగ్. అలా కాకుండా, మీరు ఎంతో బాగా పని చేస్తున్నాకూడా- కంపెనీ నష్టాల్లోవున్నా, పనిలేకపోయినా, మీ ప్రాజెక్టు పూర్తయిపోయి మీ అనుభవానికి తగ్గ వేరే ఉద్యోగాలు ఏమీ లేకపోయినా మిమ్మల్ని ఉద్యోగంలోనించీ తీసివేయటం పేరు "లే ఆఫ్". గత రెండేళ్ళుగా విపరీతంగా పెరిగిపోయిన ఈ లే ఆఫ్‌ల ఉపాఖ్యానమే ఈ ఉద్యోగపర్వం.

అమెరికాలో ఏళ్ళ తరబడి నివాసం వున్నవారు, ఈ లే ఆఫుల్ని జీవిత కాలంలో కనీసం ఒక్కసారికిమించి చూడటం సాధారణంగా సహజమే. మొట్టమొదటిసారి ఇది వచ్చినప్పుడు ఆకాశం మిన్ను విరిగి మీద పడ్డట్టుగానూ కాళ్ళ క్రింద భూమి విచ్చుకుని లోపలికి లాగేసుకుంటున్నట్టుగా అనిపించినా, దరిమిలా అది అలవాటయిపోతుంది. అంతే అసలు బాధ పడకుండా ఆనందంతో ఆహ్వానిస్తారని కాదు. మొదటి రెండురోజులూ కొంచెం డీలా పడినా, వెంటనే సర్దుకుని ముందుకి పోవటానికి సంసిద్ధులవుతారు.

కాకపోతే ఇండియానించి కొత్తగావచ్చి ఇదేదో భూతల స్వర్గమని, జీవిత మంతా పూల పానుపేననీ ఇంకా అనుకుంటున్నవారికి ఇదొక పెద్ద దెబ్బ. ఈ లే ఆఫ్ అనుకోకుండా రావటంతో ఒక్కసారిగా నిర్ఘాంతపోతారు. కొత్తగా అమెరికా రావటంవల్ల ఉద్యోగం లేకపోయినా కొన్నాళ్ళు బండి నడపటానికి తగినన్ని ఆర్థిక వనరులు లేకపోవటంతో అదొక పెద్ద తలనొప్పి.

ఈ మధ్య డాట్‌కామ్‌లు దివాళా తీయటం మొదలు పెట్టాక, ఈ లే ఆఫ్ ల సత్తా ఏమిటో తెలిసింది. ఎక్కడా చూసినా, ఏ కంపెనీ పేరు చెప్పినా, ఉద్యోగా లు పోవటం గురించే చెప్పుకోవటం.

పలకరించుకునేటప్పుడు "ఏమండీ! మీ ఉద్యోగమెలావుంది?" అనటానికి బదులు, "ఏమండీ! ఇంకా ఉద్యోగం వుందా?" అనాల్సి వచ్చింది.

మొదటిసారిగా ఇలా ఉద్యోగం పోయినవారు, జాబ్ పోయిందన్న బాధ కన్నా, నలుగురికీ తెలిస్తే పరువు పోతుందేమోనని ఆ విషయాన్ని గుప్తంగా వుంచి, వాళ్ళల్లో వాళ్ళే కుమిలిపోయిన ఉదంతాలూ వున్నాయి. ఇలా చేయటం వల్ల మూడు నష్టాలు వున్నాయి. ఒకటి, మనసులోని బాధ బయటికి చెప్పకపోతే ఆరో గ్యం మీద పెద్ద దెబ్బ తీస్తుంది. అంటే పేపర్‌లో వేసి పబ్లిసిటీ ఇమ్మని కాదు, కనీసం ముఖ్యమైన ఇద్దరు ముగ్గురు స్నేహితులతో ఆ బాధని పంచుకోవటం అవసరం. రెండు, ఒక్కొక్కప్పుడు, మిమ్మల్ని లే ఆఫ్ చేసిన కంపెనీని కోర్టుకి ఈడ్చటానికి అవకాశం వుండవచ్చు. ఆ సందర్భంగా మిత్రులు, తమ అనుభవాల ద్వారా మంచి సలహాలిచ్చే అవకాశం పోతుంది. మూడవది, మంచి స్నేహితుల నెట్‌వర్క్ వుంటే, వాళ్ళ ద్వారా మళ్ళీ ఉద్యోగం రావటం చాల సులభం. ఎవరికీ చెప్పకపోతే ఆ అవ కాశం కూడా పోతుంది. అందుకేనేమో, అడగకపోతే అమ్మయినా పెట్టదని మనకి సామెత కూడా వుంది.

అలాటి వాళ్ళల్లో ఒకాయనలా కుంగిపోతుంటే నేనే కలగజేసుకుని చెప్పా ను. "ఈ లే ఆఫుల్లో ఉద్యోగాలు పోవటం మన అసమర్థత వల్లకాదు. బిజినెస్ కండి షన్స్ బాగా లేకపోవటం వల్ల. ఇదేదో పెద్ద వ్యాపార రహస్యమేమీ కాదు. పేపర్లో మీ కంపెనీ 1600మందిని తీసేస్తున్న దని మొదటి పేజీలో పెద్ద అక్షరాలతో వేశారు. అందుకని అదేదో మీ తప్పని బాధ పడకండి. మీ అనుభవంతో, నెట్ వర్కింగ్‌తో ఇంకో ఉద్యోగం సంపాదించుకోవటం అస్సలు కష్టమేమీ కాదు. నా వల్ల సహాయం కావాలంటే కూడా చెప్పండి ఏం కావాలో. నా చేతనయినంత నేను చేస్తాను" అని.

నిజానికి ఈ లే ఆఫ్‌లన్నీ మెరిట్ ప్రకారం కొలతలు వేసి చేస్తారనుకోవటం పొరబాటు. కొంతమంది బాసురులు, కొండొకచో భస్మాసురులుగా మారి, తమకి నచ్చని వాళ్ళని ఇంటికి పంపించటానికీ, తమకన్నా తెలివిగా పనిచేసే వాళ్ళెక్కడ తమని తినేస్తారోననే భయంతో గబా గబా పరుగెడుతున్న వాళ్ళని ఆపటానికీ, ఈ లే ఆఫులని ఒక సాధనంగా వాడుకుంటారు.

ఇలాటి నలుగురిలో ఒక నారాయణగారు, ఒక కంప్యూటర్ కంపెనీలో సీనియర్ ప్రాజెక్ట్ మానేజర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన శుభ

సందర్భంలో జరిగిన క్లోజింగ్ మీటింగ్‌లో, ఆయన్నీ ఆయన టీమ్ మెంబర్లనీ ఎగ్జిక్యూటివ్స్ అందరూ మెచ్చుకున్నారు. వైస్ ప్రెసిడెంట్ ఆ టీమ్ మెంబర్లందరికీ, నారాయణగారితో సహా కాష్ బహుమతులు కూడా ఇచ్చాడు. నారాయణగారి స్పీడు చూసి ఎప్పుడూ భయపడే జార్జి ఈ బహుమతులని చూసి తన మతి పోగొట్టుకున్నాడు. జార్జి ఈ ప్రాజెక్ట్ మానేజర్లందరికీ పెద్దబాసూ డైరెక్టరూ కనుక అలా అతను బహు బహుమతులు సంపాదించుకుంటే తన డైరెక్టరికం బహుశా బజారున పడుతుందని భయపడి ఏంచేయాలా అని ఆలోచించాడు. ఈలోగా లే ఆఫులు వస్తున్నాయి కనుక, ఏవో కుంటిసాకులు చెప్పేసి నారాయణ పేరు లిస్ట్‌లో పెట్టేశాడు.

నారాయణ అంతకుముందిలాటివి చూసినా ఇప్పుడు తనదాకా వచ్చింది కనుక, కోర్టుకి పోవటానికి నిశ్చయించుకున్నాడు. అన్నిలావాదేవీలనించీ పేచీల నించీ వదిలేస్తున్నట్టు కాగితం మీద సంతకం పెడితే రెండు నెలల జీతం ఇస్తాం, లేకపోతే అదీ లేదోచ్ అన్నారు ఆ కంపెనీవాళ్ళు. లేకపోతే లేదోచ్, నేను కోర్టుకెక్కుతున్నానోచ్ అని, కోర్టుకి వెళ్ళకుండా ఒక లాయర్ దగ్గరికి వెళ్ళాడు ఆవిడంతా క్షుణ్ణంగా విని లావొక్కింటే కాదు చాలవుందని, అన్ని పాయింట్లూ రాసి ఫైల్‌ని బాగా లావుగా చేసింది. ఈయన దగ్గర మూడొందల డాలర్లు తీసుకుని అతని పేర ఆ కంపెనీకి ఒక నోటీస్ తగిలించింది.

ఆవు పరుగెత్తుతుంటే, కుక్క దాన్ని తరుముతుంటుంది. ఇక్కడ పొరబాటు కుక్కది కాదు ఆవుది. అది అలా పరుగెడుతున్నంతసేపూ, కుక్క దాన్ని తరుముతూనే వుంటుంది. కానీ ఆలా పరుగెడుతున్న ఆవు, ఒక్కసారి ఆగి వెనక్కి తిరుగుతుంది. అది చూసి కుక్క కొంచెం దూరంగా ఆగుతుంది. ఆవు కొమ్ములు విసురుతుంది. కుక్కకి భయమేసి తోక ఝాడించి పారిపోతుంది. అలాగే మనకి కంపెనీలు ఉద్యోగాలు తీసేస్తాయని భయం వుండొచ్చు. కానీ ఆ ఉద్యోగం పోయాక, అందులోనూ, వ్యక్తిగత రాజకీయాల వల్ల పోయాక, ఎదురు తిరగటం వల్ల నష్టం లేదు. అలాగే ఆ కంపెనీలకి కూడా, ముఖ్యంగా పేరు పడ్డ పెద్ద కంపెనీలకి ఇలాటి అర్భకుల వల్ల వాళ్ళ పేరు పడిపోవటం ఇష్టముండదు. అందుకని వాళ్ళూ జాగ్రత్త పడతారు. అందుకే నారాయణతో బేరం మొదలు పెట్టారు. నాలుగు నెలల జీతం ఇస్తాం వూరుకో అన్నారు. ఈయన వూరుకోను అన్నాడు ఇంగ్లీష్‌లో. తర్వాత వాళ్ళు ఆరు నెల్లు, సంవత్సరం, రెండేళ్ళు అంటూ కాంపెన్‌సేషన్ పెంచుకుంటూ పోయారు. ఎక్కడో ఇద్దరికీ ఆమోదమైన చోట అది ఆగింది. ఈయన ఆనందంగా ఆ డబ్బులు తీసుకుని మూడు వారాల్లోనే ఇంకో కంపెనీలో చేరాడు. కనుక లే ఆఫులన్నీ బాధాకరంగానేవుండవు. కొన్ని లాభదాయకంగా కూడా వుంటాయి. కొంచెం కొమ్ములు విసిరితే, కొమ్ములు తిరిగిన కంపెనీలుకూడా చాల సందర్భాల్లో మనం చెప్పినట్టు వింటాయి. కాకపోతే ఆ కొమ్ములకి కాస్తో కూస్తో వాడి అంటే నిరూపించదగ్గ ఆ లా పాయింట్లలా వుండాలన్నమాట.

* * *